క్లుప్తంగా

15న మందపల్లి దేవస్థానంలో వేలం పాటలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి గ్రామంలో ఉన్న ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానానికి సంబంధించి వివిధ వేలం పాటలు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జూలై 17 వరకూ కొబ్బరికాయలు, నల్ల నువ్వుల నూనె, కిరాణా, పూజా సామగ్రి సెట్లు, నెయ్యి, పెరుగు, కూరగాయలు, ఫ్లవర్ డెకరేషన్, ప్రింటింగ్ సామగ్రి, టెంట్ హౌస్ సామగ్రి, ఎలక్ట్రికల్ డెకరేషన్, శానిటేషన్ సామగ్రి, జపం, హోమ సామగ్రి సెట్లు, సర్వేకరట్లు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, సర్వెంట్లు సరఫరా చేసేందుకు టెండర్ కం ఈ-టెండర్లు, దేవస్థానంలోని గానుగ మిల్లులో నల్ల నువ్వుల నూనెను ఆడి భక్తులకు అమ్ముకునేందుకు లైసెన్స్ హక్కుకు టెండర్ కం బహిరంగ వేలంపాట, అలాగే వేణుగోపాల స్వామివారి దేవస్థానానికి కొత్తపేట, ఊబలంక గ్రామాల్లో ఉన్న 8.76 ఎకరాల మెరక భూమి 2025-26 నుండి 2027-28 వరకు మూడేళ్ల కాల పరిమితిలో కౌలు సాగుకు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు వివరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో మందేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద వేలంపాటలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు టెండర్లు, వేలంపాటల్లో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా అమ్మవారి తీర్థం

ఆలమూరు: చెముదులంకలో ధనలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు. గురువారం రాత్రి గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు భక్తులను కనువిందు చేశాయి.

సత్తెమ్మ అమ్మవారు..

స్థానిక యర్ర కాలనీలో సత్తెమ్మ తల్లి తీర్థం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. భారీ అన్న సమారాధన జరిగింది.

శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ



మామిడికుదురు: ఆషాఢ మాసం బహుళ పక్షం పాడ్యమి శుక్రవారం సందర్భంగా పాశర్లపూడిబాడవలో కొలువైన కనకదుర్గమ్మను శాకాబరీదేవిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

యోగా పోటీల్లో తరుణశ్రీకి గోల్డ్ మెడల్

రావులపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమం, రోటరీ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి గోల్డ్ మెడల్ వచ్చిందని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బీఏ సెకండియర్ విద్యార్థిని కె.తరుణశ్రీని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రాజోలు: సోంపల్లి-బి.సావరం కెనాల్ రోడ్డులో శుక్రవారం ఈదురు గాలులకు కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై కూలడంతో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ధ్వంసమైంది. విద్యుత్ తీగలు సీసీ రోడ్డుపై చెల్లాచెదురుగా తెగిపడ్డాయి. రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు రావడంతో స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది సరఫరా నిలిపివేసి, మరమ్మతులు చేపట్టారు.

దేశ ప్రగతికి అవరోధం

కొత్తపేట: జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. గర్భధారణ మధ్య సరైన అంతరాన్ని పాటించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్ లెవీ అన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

ఆలమూరు: జనాభా నియంత్రణకు కృషి జరగాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్, బి.అనంత రామకృష్ణ అన్నారు. వివిధ గ్రామాలు, ఆయా పీహెచ్‌సీల్లో ర్యాలీలు నిర్వహించారు.

అయినవిల్లి: వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు పి.విజయ్, లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు.

ఈ రోగానికి మందేదీ..?

- సర్కారీ దవాఖానాకు నిర్లక్ష్యపు సుస్తీ
- ఆస్పత్రిని పట్టిపీడిస్తున్న వైద్యుల కొరత
- వంద పడకలున్నా సేవలు అంతంతమాత్రం
- వెలవెలబోతున్న ఓపీ విభాగం



రాజోలు సామాజిక ఆస్పత్రి



ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఓపీ విభాగం



ఆస్పత్రి ఆవరణలో నిరుపయోగంగా అంబులెన్స్

రాజోలు: నియోజకవర్గ కేంద్రమైన రాజోలు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో నాడు గ్రేడ్-ఏలో నిలిచి ఈ ప్రాంతవాసులకు ఘనమైన సేవలు అందిస్తే.. ప్రస్తుతం ఆస్పత్రి సేవలు తిరోగమనంలో పడ్డాయి. ఆస్పత్రిలో సౌకర్యాలున్నా, రోగులకు అందుతున్న సేవలు శూన్యంగా మారాయి. ఈ నేపథ్యంలో రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి రాకపోవడంతో ఓపీ విభాగం వెలవెలబోతోంది. 50 పడకల ఆస్పత్రిగా ఉన్న కమ్యూనిటీ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి వంద పడకలుగా మార్చారు. దానికి తగ్గట్టుగా వైద్యులు, సిబ్బంది నియామకాలు జరగకపోవడంతో సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. గతంలో రోజుకు 100 నుంచి 150 వరకున్న ఓపీ రోజురోజుకూ తగ్గి కేవలం 20 నుంచి 30 మందికి పడిపోయింది. గతంలో ఇన్ పేషెంట్లకు రోజుకు 70 నుంచి 90 భోజనాలు అందించేవారు. ప్రస్తుతం రోజుకు ఐదు నుంచి ఏడుగురికి మాత్రమే భోజనం సరఫరా చేస్తున్నారు.

గర్భిణులకు తీవ్ర ఇబ్బందులు

ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉండడంతో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. ఈ క్రమంలో గర్భిణులు ఆస్పత్రిలో పురుడు పోసుకునే పరిస్థితులు దాదాపు లేవంటున్నారు. నిరుపేద గర్భిణులు ఆస్పత్రిలో చేరాలంటే నానాకష్టాలు పడాల్సిందే. పురిటి నొప్పులు వచ్చే రెండు, మూడు రోజులు ముందు ఆస్పత్రికి వెళ్లినా, గర్భిణులకు ఆస్పత్రిలో చేర్పించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గర్భిణులకు తూతూమంత్రంగా వైద్య పరీక్షలు చేసి, అమలాపురం, కాకినాడ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఏడాది నుంచి గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మత్తు మందు ఇచ్చే వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపు వద్ద కంటి వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యులు సేవలందిస్తున్నారు. దీంతో రెగ్యులర్‌గా ఆస్పత్రికి వచ్చే రోగులకు వీరి సేవలు అరకొరగా అందుతున్నాయి. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూలన పడిన అంబులెన్స్

ఓఎన్జీసీ సమకూర్చిన అంబులెన్స్ వినియోగించకపోవడంతో మూలనపడి ఉంది. స్వల్ప మరమ్మతులు చేయిస్తే అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకురావచ్చంటున్నారు. ఆస్పత్రిలో అత్యవసర సమయంలో రోగులను మెరుగైన వైద్యం కోసం అమలాపురం, కాకినాడకు ఈ అంబులెన్స్‌లో నామమాత్రపు చార్జీలతో తీసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రోత్సహించడం కోసం స్వల్ప మరమ్మతులు కూడా చేయించకుండా ఆవరణలో ఓఎన్జీసీ సమకూర్చిన అంబులెన్స్‌ను వదిలివేశారు. దీంతో వర్షానికి, ఎండకు దుమ్ము పట్టి, మంచి కండీషన్‌లో ఉన్న అంబులెన్స్ అక్కరకు రాకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందుల కొరత ఉంది



పొన్నమండ నుంచి రాజోలు ఆస్పత్రికి ఫిట్స్ తగ్గేందుకు వాడే మాత్రల కోసం వచ్చాను. మందుల విభాగంలో అడిగితే మాత్రలు లేవన్నారు. బయట మందుల షాపులో తీసుకోమన్నారు. మందుల షాపుల్లో కొనుక్కుంటే ఇక్కడకు రావడం ఎందుకు? ఆస్పత్రిలో అన్ని రకాల మాత్రలు అందుబాటులో ఉంచాలి.

– కంచర్ల శ్రీనివాస్(సిద్ధాంతి), పొన్నమండ

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. శాశ్వత గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సెలవు రోజుల్లో పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళితే.. అమలాపురం, కాకినాడ ఆస్పత్రులకు పంపేస్తున్నారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

– కట్టా శ్రీనివాసరావు, సర్పంచ్, సోంపల్లి

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం



సమావేశం ఏర్పాట్లను పరిశీలిస్తున్న గన్నవరపు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం చాకలిపాలెం గ్రామంలోని కృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాలులో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్టు పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. సమావేశం ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పీఏసీ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, పినిపే విశ్వరూప్, తోట త్రిమూర్తులు తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసులకు ట్రాక్టర్ల అప్పగింత

పి.గన్నవరం: తాటికాయల వారిపాలెం ర్యాంపు నుంచి ఇసుక అక్రమ రవాణాకు వినియోగిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీటిని తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు శుక్రవారం అప్పగించినట్టు ఎస్సై బి.శివకృష్ణ చెప్పారు.

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయండి

- వరదలు, తుపాన్లపై ఆర్డీఓ సమీక్ష



సఖినేటిపల్లిలో వరద ముందస్తు చర్యలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ మాధవి

సఖినేటిపల్లి: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అధికారులను ఆదేశించారు. తుపాన్లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.కృష్ణమూర్తితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలకు ఎవరూ ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. వరద ఉధృతిని బట్టి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా బోట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో తగినన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, మండల పరిషత్ అధికారి సోమేశ్వరి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీలు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో ఆర్డీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, పట్టాలు, ఖాళీగా ఉన్న ప్లాట్ల డేటాపై ఆరా తీశారు. అన్ని రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్షించారు. క్రాప్ కల్టివేటర్స్ రైట్స్ కార్డ్స్ పంపిణీలోను, ల్యాండ్ రికార్డ్స్, ఫార్మర్ రిజిస్ట్రేషన్లపై పురోగతి ఉండాలని వీఆర్వోలను ఆదేశించారు.

ఎస్టీలకు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలి

వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీను



ఏకలవ్యుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీను తదితరులు

కొత్తపేట: ఏకలవ్య ఎరుకుల (ఎస్టీ) సంఘాలకు ప్రతి మండలంలో కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్రా శ్రీను విజ్ఞప్తి చేశారు. జిల్లా, మండల ఏకలవ్య ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏకలవ్యుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంత మార్కెట్ ప్రాంతంలో ఏకలవ్యుని చిత్రపటానికి శ్రీను, సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ప్రతి మండలంలో కమ్యూనిటీ భవనాలతో పాటు, ఏకలవ్యుని విగ్రహాలు నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మునుపటి గోవిందు, సింగం గోవిందు, భారతి జార్జి, గద శ్రీను, ఎం సతీష్, గద నాని, కుర్ర సురేష్, లోకుల నాగబాబు, మొగిలి ముని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలి



పినపళ్లలో దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న ప్రతినిధులు

ఆలమూరు: రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ రూ.15 వేల పెన్షన్‌ను మంజూరు చేయాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అడ్వకసి కో-ఆర్డినేటర్ బడుగు సుబ్బయమ్మ, సీబీఆర్ కో-ఆర్డినేటర్ బి.మహిమారావు డిమాండ్ చేశారు. పినపళ్లలో స్థానిక శ్రీసంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో శుక్రవారం దివ్యాంగుల హక్కులు, సంక్షేమంపై సర్పంచ్ సంగిత సుభాష్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కో-ఆర్డినేటర్లు మాట్లాడుతూ, బాలికల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చిన్నారుల అంగవైకల్యాన్ని గుర్తించి, వారిని భవిత కేంద్రాల్లో చేర్చేందుకు సంస్థ పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో 8 మంది దివ్యాంగుల సమస్యలను ఆలకించారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఏఎంసీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ యనమదల రాణి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా వెంకటలక్ష్మి

ఆలమూరు: మడికి గ్రామానికి చెందిన దూలం వెంకటలక్ష్మి స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడినట్లు ఏఎంసీ కార్యదర్శి వాసుదేవరరావు శుక్రవారం తెలిపారు. కూటమి పార్టీల ఒప్పందంలో భాగంగా ఆలమూరు ఏఎంసీని జనసేన పార్టీకి లభించింది. ఉపాధ్యక్షులుగా కేతా రాంబాబుతో పాటు, సభ్యులుగా ఆకుల రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్‌కుమార్, దండే శ్రీదేవి, డి.మంగాలక్ష్మి, కాలా సత్యవేణి, గాడ మంగ, గుత్తుల నాగేశ్వరరావు, కొమ్ము దేవి, నామాల సూర్యనారాయణమూర్తి, రాయుడు నాగరామదుర్గ, టి.సీతారామలక్ష్మి, తోరాటి సత్యకిషోర్, వెత్సా సుబ్బారావు నియమితులయ్యారు.

పార్టీలో కాపులకు తగిన ప్రాతినిధ్యం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



పార్టీ పదవులు పొందిన నాయకులను సత్కరిస్తున్న జగ్గిరెడ్డి







కృష్ణారెడ్డిని, సుబ్బారావును, గోపాలపురంలో దొరబాబు, ప్రకాష్‌ను అభినందిస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: అన్ని వర్గాలకు సమ న్యాయంలో భాగంగా కాపు వర్గీయులకు వైఎస్సార్ సీపీ కమిటీల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జిల్లా కమిటీలో వానపల్లికి చెందిన బండారు దొరబాబు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం నుంచి గొలకోటి సూర్యప్రకాష్ సెక్రటరీ యాక్టివిటీగా నియమితులైన సందర్భంగా వారు శుక్రవారం గోపాలపురంలో జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను వారు సత్కరించగా, ప్రతిగా జగ్గిరెడ్డి ఆ ఇద్దరినీ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కాపు కుటుంబాల్లో మహిళలకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక ప్రోత్సాహం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్టీ కమిటీల్లో కాపు సామాజిక వర్గానికి తగినన్ని పదవులు ఇచ్చామన్నారు. వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, పార్టీ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి బొంతు రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

మలికిపురం: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో ఇటీవల పలు రాష్ట్ర, జిల్లా స్థాయిలో పదవుల్లో నియమితులైన నాయకులంతా జగ్గిరెడ్డిని రావులపాలెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించగా, అనంతరం జగ్గిరెడ్డి కూడా నాయకులను శాలువాలతో సత్కరించారు. పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, కేఎస్ఎన్ రాజు, కూనపరెడ్డి రాంబాబు, మోకా సురేష్, ఉచ్చల విష్ణు, తాడి సహదేవ్, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీను, జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, కానూరి బాబి, బొక్క శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో సామాజిక న్యాయం

ఆలమూరు: రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు చేసే పార్టీ వైఎస్సార్ సీపీయేనని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పెదపళ్లకు చెందిన నాయీ బ్రాహ్మణ వర్గానికి చెందిన దొడ్డవరపు సుబ్బారావుకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా చోటు లభించింది. ఈ సందర్భంగా గోపాలపురంలో జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పెదపళ్ల నేతలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సుబ్బారావును కూడా జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ నేతలు నెక్కంటి వెంకట్రాయుడు, ఏడిద మెహర్‌ప్రసాద్, మేడపాటి లక్ష్మణరావు, అలుగోజు శ్రీనివాసు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి అభినందన

రావులపాలెం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కొమరరాజులంక గ్రామానికి చెందిన పడాల శ్రీహరి కృష్ణారెడ్డి నియమితులు కావడంతో ఆయనను చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. గోపాలపురంలోని జగ్గిరెడ్డి నివాసానికి వచ్చి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని సత్కరించారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చాకలిపాలెం కృష్ణ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా, రాష్ట్ర నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని విభాగాల నాయకులు, సారథులు హాజరుకావాలని కోరారు. శనివారం మధ్యాహ్నం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు స్వగృహం నుంచి ర్యాలీగా తరలివెళ్లనున్నట్టు చెప్పారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

అంబాజీపేట: నిరంతరం ఆదాయం సమకూర్చుకోవడానికి రైతులకు చక్కటి అవకాశం తేనెటీగల పెంపకమని కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ అధ్యక్షుడు గణపతి వీరరాఘవులు, సంకల్ప సేవా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రత్నకిషోర్ తెలిపారు. అంబాజీపేట కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తేనెను ఉత్పత్తి ద్వారా రైతులు ఆర్థికంగా స్థిరపడవచ్చని సూచించారు.

సమష్టి కృషితో ఆర్టీసీకి లాభాలు



డిపో ఆవరణలో మొక్క నాటుతున్న ఈడీ విజయరత్నం


రాజోలు: ఉద్యోగుల సమష్టి కృషితో ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని సంస్థ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం అన్నారు. శుక్రవారం ఆయన రాజోలు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. అలాగే ఆర్టీసీ బస్సుల ఇంజిన్ కండిషన్ వివరాలను ఆరాతీశారు. ఆర్టీసీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు పలు సూచనలిచ్చి, కొన్నింటికి అనుమతులు మంజూరు చేశారు. ఆయనకు డిపో మేనేజర్ ధనమ్మతో పాటు, డ్రైవర్లు, కండక్టర్లు స్వాగతం పలికారు. డిపో ఆవరణలో ఈడీ మొక్కను నాటారు. అనంతరం జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్మికులు సంస్థ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. డీపీటీఓ ఎస్‌పీపీ రాఘవకుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కొత్తపేట: సంపూర్ణ ప్రజారోగ్యం లక్ష్యంగా గ్రామాల్లో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. పలివెల శివారు పూజారిపాలెం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, డెంగీ మాసోత్సవాల తీరును కొత్తపేట మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజబాబుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు.

అయినవిల్లి: మలేరియా వ్యాప్తి చెందకుండా ప్రతి ఇంట్లో చర్యలు తీసుకోవాలని డాక్టర్ నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. నేదునూరు పెద్దపేటలో ఆయన పర్యటించారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

తీరంలో వరద కష్టాలు



పెదపట్నం లంక నుంచి పడవలో తరలిస్తున్న పశుగ్రాసం

మామిడికుదురు: తీర ప్రాంతాల రైతులకు వరద కష్టాలు మొదలయ్యాయి. గోదావరి నది ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో నదీపాయల్లో వరద నీరు ఉరకలెత్తుతోంది. నదీపాయల్లో తాత్కాలికంగా వేసుకున్న మార్గాలు తెగిపోయాయి. దీంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పెదపట్నం మధ్య లంకలో రైతులకు వ్యవసాయ భూములున్నాయి. అక్కడ పశుగ్రాసం పుష్కలంగా అందుబాటులో ఉంది. దీంతో పాటు రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో మధ్యలంక నుంచి పశుగ్రాసంతో పాటు, కూరగాయలను ఒడ్డుకు చేర్చేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నాటు పడవల ద్వారా పశుగ్రాసం, కూరగాయలను తరలించుకుంటున్నారు. కొందరు రైతులు మధ్యలంకలోనే పాకల్లో పశువులను కట్టేసి మేపుతున్నారు. అక్కడకు రాకపోకలు సాగించడం, పాల ఉత్పత్తులను తరలించుకోవడం ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు నెలలకు పైగా తాము వరద కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

నదీపాయల్లో ఉధృతి

పి.గన్నవరం: మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతోంది. బూరుగులంక రేవు వద్ద వశిష్ఠ నదీపాయలో తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు ఈ రేవు వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు. యర్రంశెట్టివారిపాలెం వద్ద తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక గ్రామాల ప్రజలు పడవలను ఆశ్రయిస్తున్నారు. లంకల్లోని లోతట్టు ప్రాంతాలు వరదనీట మునగడంతో రైతులు పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

వృద్ధ గౌతమికి వరద పోటు

అయినవిల్లి: వరద ఉధృతి పెరగడంతో ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయలోకి వరద నీరు చేరింది. నిన్నటి వరకూ ఈ పాయలో నీరు లేదు. వృద్ధగౌతమి పాయలోకి వరదనీరు రావడంతో లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని కూరగాయలు, అరటి, మొక్కజొన్న, కోకో, బొప్పాయి. నిమ్మ తదితర పంటలు, తోటలు వరద ప్రభావానికి గురయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల్లో వంద ఎకరాల మేరకు నీట మునిగినట్టు చెబుతున్నారు. దీంతో తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే ముక్తేశ్వరం-ఎదురుబిడెం వద్ద వరద నీరు చేరి వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో తాత్కాలిక రహదారి మునగడంతో పంట్ల రాకపోకలు నిలిపివేశారు. దీంతో వాహనచోదకులు ముమ్మిడివరం, మురమళ్ల, యానాం బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతి తగ్గాకే ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో రాకపోకలు పునరుద్ధరిస్తారని అధికారులు చెబుతున్నారు.